క్లుప్తంగా

రైతుల వివరాలను నమోదు చేయాలి



మానవపాడు: మండలంలోని విత్తనాల షాపు డీలర్లు తప్పనిసరిగా రైతులకు అమ్మిన వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు సుబ్బారెడ్డి, అనిత, చంద్రశేఖర్, రాధ, సురేఖ తెలిపారు. శుక్రవారం మండలంలోని కలుకుంట్లలో రైతువేదికలో ఏడు మండలాల విత్తనాల షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించండి

అయిజ: పశువులకు వ్యాధులు రాకుండా ఉండేందుకు టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపరాణి కోరారు. శుక్రవారం మండలంలోని పులికల్‌లో 156 పుశువులకు టీకాలు వేయించారు. పుశువులకు గురుక వ్యాధి, జబ్బ వాపు వ్యాధులు రాకుండా ఉండేందుకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.

కోర్టు తీర్పును స్వాగతిస్తాం

అయిజ: పశ్చిబెంగాల్ ప్రభుత్వానికి కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఓబీసీలలో పలు క్లాసులు కొట్టివేసిందని, 2010 తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అన్ని ఓబీసీ ధ్రువ పత్రాలను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చిందని తెలిపారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



మానవపాడు: విద్యుత్ స్తంభం ఎప్పుడు పడుతుందో తెలియని ప్రమాదరక పరిస్థితిలో ఉందని మండలంలోని కలుకుంట్ల గ్రామస్తులు తెలిపారు. అంతర్రాష్ట్ర రహదారి పక్కానే స్తంభం ఒరిగి ఉందని పశువులు, పాదాచారులు సంచరిస్తుంటారని ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ స్తంభలు ప్రమాదకరంగా ఉంటే పట్టించుకోరా అంటూ గ్రామస్తులు అంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య

శాంతినగర్: కడుపునొప్పితో బాధపడుతున్న యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వడ్డేపల్లి మండలంలోని కొంకలలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బోయ గాకారి కుమారుడు శివరామ్ (22) ఏడాదికాలంగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. గురువారం రాత్రి 10గంటల సమయంలో ఇంట్లో భోజనం చేసిన అనంతరం బయటికి వెళ్లి వస్తానని చెప్పాడు. అర్ధరాత్రి 2:30 గంటల సమయంలో శివరామ్ స్నేహితుడైన తిరుమల్‌కు ఫోన్ చేసి మాపొలం సమీపంలోని ఈదమ్మ గుడివద్ద గడ్డిమందు తాగాను నేను బతకను అంటూ రోధించాడు. వెంటనే తిరుమల్ ఫోన్‌చేసి విషయాన్ని శివరామ్ కుటుంబసభ్యులకు తెలిపాడు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కోలుకోలేక మృతిచెందాడు. మృతుని తండ్రి గోకారి ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

రెండేళ్ల జైలు.. జరిమానా

గద్వాల క్రైం: దాడికి పాల్పడిన వ్యక్తులకు గద్వాల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు ఏపీపీ భవాని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మల్దకల్ మండలం చిప్పదొడ్డికి చెందిన రాముడు, ఆంజనేయులుకు భూతగాదాలున్నాయి. అయితే 2016లో రాముడు తన పొలంలో కుటుంబసభ్యులైన శివన్న, లక్ష్మణ్, చిన్న ఆంజనేయులుతో కలిసి పనులు చేస్తుండగా.. ఆంజనేయులు, చిన్న మాదన్న, పెద్ద గోవిందు, హన్మంతు వచ్చి దాడి చేశారు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి శుక్రవారం దాడి చేసిన వ్యక్తులకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు చెప్పారు.

ఆంజనేయస్వామి జాతర

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో ఈశ్వర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున భక్తులు స్వామివారి రథోత్సవాన్ని కనుల పండవగా నిర్వహించారు. అంతకుముందు అఖండ భజన కార్యక్రమాలతోపాటు అడుగల భజన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రథోత్సవాన్ని గ్రామపుర వీధుల గుండా సాగింది.

నత్తనడకన బ్రిడ్జి పనులు



బ్రిడ్జికింద షిల్ట్ తొలగిస్తున్న యంత్రాలు

- 2009లో శిథిలమైన ఎక్లాస్‌పురం బ్రిడ్జి
- 2018లో రూ.5 కోట్లు మంజూరు



కొనసాగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు

అయిజ: గట్టు–అయిజ మండలాల మధ్య అయిజ శివారులో పెద్ద వాగుపై కొన్నేళ్ల క్రితం నిర్మించిన వంతెన 2009లో వచ్చిన వరదలకు శిథిలమైంది. బ్రిడ్జి ఎత్తు, వెడల్పు, పొడవు పెంచి కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం 2018లో రూ.5కోట్లు మంజూరు చేసింది. 2019లో ఆర్‌అండ్‌బీ అధికారులు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకున్నారు. 2022లో బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యింది. అయితే ఇప్పటి వరకు అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి కాలేదు. దానికి సంబంధించిన భూసేకరణ కాకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

భూసేకరణకు నిధులు కరువు

బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు వేయాలంటే చుట్టుపక్కల రైతుల నుంచి భూసేకరణ చేయాలి. దానికోసం సుమారు రూ.15 లక్షలు నిధులు అవసరమవుతుంది. అయితే ఆర్‌అండ్‌బీ శాఖలో నిధులు లేకపోవడంతో ఇంతవరకు భూసేకరణ పనులు పూర్తికాలేదు. దానివలన ప్రభుత్వ స్థలంలోనే అప్రోచ్ రోడ్డును నిర్మించేందుకు అధికారులు పూనుకున్నారు. కాంట్రాక్టర్, సిబ్బంది ప్రస్తుతం బ్రిడ్జికింద షిల్ట్ తొలగిస్తున్నారు. వేరింగ్ కోట్, బీటీరోడ్డు రివ్యూట్‌మెంట్ పనులు పూర్తిచేయాల్సి ఉంది.

త్వరలో పూర్తి చేస్తాం

అప్రోచ్ రోడ్డుకు భూసేకరణ చేయాల్సి ఉండడంతో పనులు ఆలస్యమయ్యాయి. భూసేకరణలో భాగంగా రైతుల నుంచి భూమిని సేకరించడానికి సుమారు. రూ.15 లక్షలు అవసరం ఉంటుంది. ఆర్‌అండ్‌బీ శాఖలో నిధులు లేకపోవడంతో ప్రభుత్వ స్థలంలోనే పాత పద్ధతిన అప్రోచ్ రోడ్డు పనులు ఇటీవలే చేపట్టాం. త్వరలోనే పనులు పూర్తి చేస్తాం.

– మహేష్, ఆర్‌అండ్‌బీ జేఈ

పనులు ఆలస్యమయ్యాయి



అయిజ–గట్టు మండలాల మధ్య బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తిచేయకపోవడంతో రెండు మండలాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పనులు పూర్తయ్యి రెండు సంవత్సరాలువుతున్నా అప్రోచ్ రోడ్డు నిర్మించలేదు. పనులు త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నాం.

– బుడ్డమ్మ, అమరవాయి

సైడ్ వాల్స్ నిర్మించాలి



బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తయినా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తికాలేదు. ఇప్పుడిప్పుడు పనులు ప్రారంభిస్తున్నారు. అయితే అప్రోచ్ రోడ్డు నిర్మించిన ప్రదేశంలో వాహనాలు కిందకు పడిపోకుండా రెండు వైపుల గోడలు నిర్మిస్తే బాగుంటుంది. అదేవిధంగా బ్రిడ్జి సమీపంలో రాత్రి వేళలా వెలుతురు ఉండేందుకు బల్బులు ఏర్పాటు చేయాలి.

– దేవన్న, ఎక్లాస్‌పురం

ఈదురుగాలుల బీభత్సం



అయిజలో పశువుల ఆస్పత్రి సమీపంలో రోడ్డుపై విరిగిపడిన చెట్టు

అయిజ: మండలంలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. ఈదురు గాలులు బలంగా వీచడంతో గ్రామాల్లో అనేకచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీనివలన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మండల కేంద్రంలో చెట్లు విరిగి రోడ్లపై పడడంతో ప్రయాణానికి అడ్డంకిగా మారింది.

వీచిన ఈదురుగాలులు

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులు వీచాయి. గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. పలు గ్రామాల్లో తడకలతో వేసిన చిన్న చిన్న గుడిసెల పైభాగాలు కూడా కొట్టుకు పోయాయి. పెద్దదిన్నెలో వేప చెట్టు విరిగి కరెంట్ స్తంభంపై పడటంతో స్తంభం విరిగిపోయింది. గ్రామస్తులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. అలంపూర్–రాయచూర్ రోడ్డు వెంట ఉన్న చెట్లు విరిగిపడ్డాయి. అంతేగాక గ్రామాలకు వెళ్లే దారుల్లో చెట్ల కొమ్మలు చెట్లు విరిగిపడటంతో రవాణాకు అంతరాయం కలిగింది. ఉరుములతో కూడిన తేలిక పాటి జల్లులు కురిశాయి.

పిడుగుపడి చెట్టుకు మంటలు



కేటీదొడ్డి: ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు శుక్రవారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాలలో వీచాయి. చింతలకుంట శివారున బ్యాగరి నాగప్ప పొలంలో పిడుగుపాటుకు తాటి చెట్టు పూర్తిగా కాలిపోయింది. ఈ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

అగ్నివీర్‌లకు ఉచిత శిక్షణ



నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో నిరుద్యోగ యువతీ, యువకులకు వారియర్స్ డిఫెన్స్ అకాడమి ఉచితంగా అగ్నివీర్ ఎంపికకు శిక్షణ ఇస్తుందని డైరెక్టర్ ఆంజనేయులు తెలిపారు. 2024 ఏడాదికి గాను నోటిఫికేషన్ విడుదల కావడంతో జనవరి నుంచి ఉచితంగా మెటీరియల్ ఇవ్వడంతోపాటు థియరీ క్లాసులు నిర్వహించారు. శుక్రవారం నుంచి ఫిజికల్ టెస్టుల శిక్షణను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ఉండవెల్లి: మండలంలోని తక్కశీలలో ఉమారామ లింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా కబడ్డీ పోటీలను నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో పోటీలను దాతలు, నాయకులు ప్రారంభించారు. మొత్తం 32 టీంలు రావడంతో 16 టీంలు మొదటి రోజు ఆడినట్లు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, ఈదన్న, వెంకట్రాముడు, రాజేష్ పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ముమ్మరంగా సాగు పనులు



ధరూరు, జాంపల్లి శివార్లలో కంది సాగు కోసం అచ్చు కొడుతున్న రైతు

- విత్తనాలు నాటే పనుల్లో రైతులు
- సాగుకు పొలాలను సిద్ధంచేసిన రైతులు
- రెండు భారీ వర్షాలతో రైతుల సంతోషం



ధరూరు శివారులో వ్యవసాయ పొలంలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

ధరూరు: భగభగమండే ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రైతులకు, ప్రజలకు వారం రోజుల క్రితం కురిసిన వర్షం కాస్త ఊరటనిచ్చింది. వాతావరణం కొంత చల్లబడడంతో ఉపశమనం పొందుతున్నారు. ఈ సారైనా మంచి దిగుబడులు సాధించేందుకు ముందస్తు ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈ 10–15 రోజుల్లో కురిసిన భారీ వర్షంతో రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి. ముందస్తుగా సాగు కోసం పంట పొలాలను దున్నుకునే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. వాతావరణం అనుకూలిస్తే మరో వారం రోజుల్లో సాగు పనులు ప్రారంభించే అవకాశం ఉంది. ఇప్పటికే పత్తి సాగు పనులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు, ఎరువులను అధికారులు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

పొలాల వెంట అన్నదాతల పరుగులు..

మండలంలో రైతులు పొలాల వెంట పరుగులు తీస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు ఇళ్లకే పరిమితమైన వారు, ముందస్తు వర్షాలతో పొలాల బాట పడుతున్నారు. మండలంలో ప్రధానంగా మెట్ట పంటగా ఆముదం, కంది, సజ్జ, జొన్న సాగు చేస్తారు. ప్రధానంగా రైతులకు అవసరమయ్యే నవ భారత్, గౌచ్ –4 వంటి రకాల ఆముదం విత్తనాలు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జోరందుకున్న పనులు..

పొలాల్లో ఎటు చూసినా రైతులు, రైతు కూలీలే కనిపిస్తున్నారు. దున్నుకున్న దుక్కుల్లో నలుచు(చెత్త) ఏరివేత, కాల్చడం, ఆముదం సాగు కోసం అచ్చు కొట్టడం వంటి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వీటితో పాటు పశువుల ఎరువులు చల్లడం, ఒండ్రు మట్టిని పొలాల్లో పరిచి నేలలను సారవంతం చేసుకుంటున్నారు. నడిగడ్డ ప్రాంతంలో అత్యధికంగా సాగయ్యే సీడ్ పత్తి సాగు కోసం రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే రైతులకు ఆర్గనైజర్లు విత్తనాలు ఇస్తుండడంతో రైతులు అందుకు సాగు పనులు చేసుకుంటున్నారు. వారం రోజులుగా సీడ్ పత్తి విత్తనాలు విత్తుకునే పనులు జోరుగా సాగుతున్నాయి. వీటితో పాటు ఖరీఫ్‌లో సాగయ్యే వరి పంటకు నారుమడులను సిద్ధం చేస్తున్నారు.

వ్యవసాయ శాఖ విఫలం..

మండలంలో వ్యవసాయ శాఖ ముందస్తు ఏర్పాట్లు చేయడంలో ఏటా విఫలమవుతూనే వస్తోంది. మరో వారం, పది రోజులు, జూన్ మొదటి వారంలో పంట సాగు పనులు పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఏటా ఆలస్యంగా విత్తనాలు ఎరువులు సరఫరా చేస్తుండడంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

పత్తి సాగు చేస్తున్నా



పొలంలో పత్తి పంటను సాగు చేసుకుంటున్నా. ఈ మధ్య కురిసిన వర్షంతో సాగుకు అనుకూలంగా మారింది. కురిసిన వర్షాలతో చదును చేసుకునే పనులు చేపట్టాం. ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు, ఎరువులు ఇవ్వడంతో పాటు కౌలు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలి. ఆర్థికంగా ఆదుకునే దిశగా చర్యలు చేపట్టాలి. ఏటా పెరుగుతున్న సాగు ఖర్చులతో అప్పుల పాలవుతున్నాం.

– దావీదు, రైతు, ధరూరు

త్వరలో విత్తనాలు అందుబాటులోకి..

ప్రస్తుతానికి 150 బస్తాల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన రైతులు వీటిని తీసుకోవచ్చు. ప్రైవేట్ డీలర్ల వద్ద వరి సీడ్ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో విత్తనాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. విత్తనాలు, ఎరువులు అవసరమైన ప్రతి రైతుకు అందిస్తాం. ఆ ప్రకారమే నివేదిక పంపాం.

– శ్రీలత, మండల వ్యవసాయ శాఖ అధికారి, ధరూరు

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం అనంతరం శాస్త్రోక్తంగా విశేష పూజలు, స్వామి,అమ్మవార్ల కల్యాణం కనులపండువగా చేశారు. అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రాత్రి భక్తుల జయజయద్వానాల మధ్య రథోత్సవం కనులపండువగా నిర్వహించారు.

యూనిఫాం తయారీ కేంద్రం ప్రారంభం

గట్టు: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో విద్యార్థుల యూనిఫాం తయారీ కేంద్రాన్ని ఏపీఎం సాంబశివుడు శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు యూనిఫాం తయారీకి సంబంధించి వస్త్రాన్ని ప్రభుత్వం మహిళా సమాఖ్యకు అప్పగించింది. అనుకున్న సమయానికే విద్యార్థులకు యూనిఫాం అందించేందుకు కృషి చేస్తామని ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు శ్రీదేవిగుప్త, సీసీలు జ్యోతి, జయాకర్, రామకృష్ణ, వీఓఏలు సురేష వీరేష, మహాదేవ్‌గౌడ్, జయరాజు, నర్సింహులు, కర్రెప్ప తదితరులు పాల్గొన్నారు.



గట్టులో యూనిఫాం తయారీ కేంద్రంలో అధికారులు

కనుల పండువగా నర్సింహస్వామి రథోత్సవం

- రథోత్సవంలో పాల్గొన్న వేలాది మందిభక్తులు

మాగనూర్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం కనుల పండువగా కొనసాగింది. ఇందులో భాగంగా తెల్లవారుజామున రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పల్లకిలో బాజాభజంత్రీల మధ్య స్వామివారి విగ్రహం ముందుకు కదిలింది. మహారాష్ట్ర, కర్ణాటక, హైదారబాద్ లాంటి ప్రాంతాల నుంచి వేలాదిగా స్వామివారి దర్శనంకోసం భక్తులు తరలివచ్చారు. పలు పార్టీల నాయకులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పాల ఉట్ల ఉత్సవం..

సాయంత్రం పాల ఉట్ల ఉత్సవాన్ని నిర్వహించారు. 25మందికి పైగా యువకులు పాల ఉట్ల స్తంభాన్ని ఎక్కేందుకు పోటీ పడ్డారు. అయితే ఈ సారి గ్రామ పెద్దలు ముందుగా కొంతసేపు చిన్నారులను పాల ఉట్లు ఎక్కించారు. ఇది భక్తులను ఎంతగానో ఆక్కటుకుంది. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, మాజీ ఉపసర్పంచ్ సుధా, ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య, బలరాజు, నరేష్, వాకిటి శ్రీనివాసులు, కృష్ణయ్య, సత్యప్ప, ఆనంద్, గ్రామ పెద్దలు, ఆనంద్‌గౌడ్, వెంకటయ్య, చెన్నప్ప, ఉజ్జెల్లి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



పాల ఉట్ల స్తంభం ఎక్కుతున్న యువకులు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా మైసమ్మ ఉత్సవాలు

మద్దూరు: మండల కేంద్రంలోని ఎండ్ల బజారులోని మైసమ్మ ఉత్సవాలు శుక్రవారం ఎంపీటీసీ వెంకటయ్య ఆధ్వర్యంలో వైభవంగా కొనసాగాయి. ఉదయం పోచమ్మ ఆలయం నుంచి మేళతాళాల మధ్య జల్ది ఊరేగింపు పాతబస్టాండ్ మీదుగా ఆలయం వరకు కొనసాగింది. అనంతరం పూజారి రాఘవేంద్రచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, ఇతర పూజ కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మహిళలు డప్పుల చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే నిడ్జింతలో పోచమ్మకు బోనాలెత్తి మహిళలు తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు ముష్టి నర్సింహులు, తిరమలప్ప, నర్సింహులు, మల్లప్ప, కృష్ణయ్య, చెన్నప్ప, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మద్దూర్‌లో బోనాలతో ప్రదక్షిన చేస్తున్న మహిళలు

ఘనంగా రథోత్సవ వేడుకలు

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో ఈశ్వర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున భక్తులు స్వామివారి రథోత్సవాన్ని కనుల పండవగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అఖండ భజన కార్యక్రమాల తోపాటు అడుగల భజన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తుల మద్యన స్వామివారి రథోత్సవాన్ని గ్రామపుర వీధుల గుండా సాగింది. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలకు బలికావొద్దు

శాంతినగర్: ఆన్‌లైన్‌లో సైబర్ మోసాలకు బలికావద్దని డీఎస్పీ సత్యనారాయణ ప్రజలకు సూచించారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ఎస్పీ రితిరాజ్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, బాల్య వివాహాలు, డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, రోడ్ సేఫ్టీ, సోషల్ మీడియా మోసాలు, సైబర్ మోసాలు, మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్ తదితర అంశాలపై పట్టణ వాసులకు అవగాహన కల్పించారు. రిజేస్ట్రేషన్, నంబర్ ప్లేట్‌లు లేని వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. కార్యక్రమంలో శాంతినగర్ సీఐ రత్నం, రాజోళి ఎస్ఐ జగదీష్, అయిజ ఎస్ఐ విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రైస్ మిల్, ఆయిల్‌మిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని.. రైస్‌మిల్ సంఘం జిల్లా అధ్యక్షుడు సి.వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఉన్న ఆ సంఘం కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లులలో పని చేసే మహిళ కార్మికులకు దుమ్ము వల్ల టీబీ, గర్భసంచి వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లను పరిష్కరించాలని అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేకుండా పోయిందని విమర్శించారు. డిమాండ్ల సాధన కోసం భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేసేందుకు కార్మికులు సిద్ధం కావాలని అన్నారు. రైస్‌మిల్, ఆయిల్ మిల్ సంఘం నాయకులు నర్సిములు, చెన్నయ్య, చంద్రమ్మ, సరోజా, మణెమ్మ, నాజీయాబేగం, చంద్రకళ, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్